క్లుప్తంగా

ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న కళాశాల యాజమాన్యం

పీలేరు : పీలేరు పట్టణంలోని సీఎస్ఆర్ డిగ్రీ కళాశాలకు ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డు లభించింది. న్యూఢిల్లీకి చెందిన ఏషియా టుడే మీడియా సంస్థ వివిధ రంగాల్లో ఉత్తమ సేవలకు అవార్డులు ప్రదానం చేశారు. అందులో భాగంగా విద్యా రంగంలో ఉత్తమ సేవలకు గానూ పీలేరు సీఎస్ఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ విజయభాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లావణ్య బెంగళూరులో మాజీ సీఎం జగదీష్‌శెట్టర్, బాలీవుడ్ నటుడు గుల్షన్ గ్రోవర్, ఎంపీ సీఎస్ మంజునాథ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

15న పెద్ద పీర్ల మెరవణి



కందుకూరులో కొలువైన పీర్లు

పెద్దతిప్పసముద్రం : మొహర్రం వేడుకల్లో భాగంగా మండలంలోని కందుకూరులో పీర్లను గ్రామ చావిడిలో కొలువుంచారు. ప్రతి ఏటా అత్యంత వైభవంగా జరిగే మొహర్రం వేడుకలను తిలకించేందుకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా ప్రజలు అధిక సంఖ్యలో వస్తారు. ఇందులో భాగంగా ఈ నెల 15న పెద్ద పీర్ల మెరవణి జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు. కుల, మతాలకు అతీతంగా జరిగే ఈ వేడుకలను విజయవంతం చేయాలని నిర్వాహకులు పేర్కొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



కానుకలు లెక్కిస్తున్న మహిళా సేవకులు

తంబళ్లపల్లె : మండల కేంద్రం సమీపంలోని మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంభిక సమేత మల్లికార్జునస్వామి ఆలయానికి భక్తులు చెల్లించిన కానుకల ద్వారా రూ.6.79 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ రవికిరణ్‌కుమార్ రెడ్డి, ఈఓ రమణ తెలిపారు. గురువారం ఆలయంలో హుండీల కానుకలను టీటీడీ మహిళా సేవకులు లెక్కించారు. భక్తులు చెల్లించిన కానుకలు రూ.6,79,677 వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లికార్జుననాయుడు, పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జున, కొండ కిట్ట, శంకర తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి డ్రైఫ్రూట్స్‌తో అలంకరణ



డ్రైఫ్రూట్స్‌తో అలంకరణలో గాయత్రి దేవి

మదనపల్లె సిటీ : శ్రీ వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక అయ్యప్ప నగర్‌లో వెలసిన శ్రీ బాల అయ్యప్పస్వామి ఆలయంలో గాయత్రిదేవి అమ్మవారికి డ్రైఫ్రూట్స్‌తో అలంకారం చేశారు. వివిధ పండ్ల గింజలతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. స్థానిక దేవళంవీధిలోని శ్రీ సోమేశ్వర స్వామి ఆలయంలో శ్రీ లలిత త్రిపుర సుందరిదేవి అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. వారాహి అష్టోత్తరం, లలిత సహస్రనామస్తోత్రపారాయణం చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

సచివాలయం తనిఖీ



రామసముద్రంలో సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

రామసముద్రం : రామసముద్రంలోని సచివాలయం –2ను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ అధికారులు సమయపాలన పాటిస్తూ ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలన్నారు. అనంతరం ఎం.గొల్లపల్లి గ్రామంలో జరిగిన గంగజాతరలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయనకు గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. గంగమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆయన వెంట నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

మదనపల్లె : యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్ సమన్వయంతో ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఈ సంవత్సరం ‘ఎవరినీ వదిలిపెట్టవద్దు, ప్రతి ఒక్కరినీ లెక్కించండి’ థీమ్‌తో ప్రపంచ జనాభా దినోత్సవం జరుపుతున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రమేష్‌బాబు తెలిపారు. గురువారం దొంతివీధి అర్బన్‌హెల్త్ సెంటర్ పరిధిలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానాటికీ పెరుగుతున్న జనాభా, తద్వారా తలెత్తే దుష్పరిణామాలను ప్రజలకు వివరించేందుకు, జనాభా పెరుగుదల పరిణామాలు, సమస్యలపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కుటుంబ నియంత్రణ, లింగ సమానత్వం, పేదరికం, మాతృ ఆరోగ్యం, మానవహక్కులు వంటి జనాభా సమస్యలపై ప్రజలకు అవగాహన పెంచడమే ప్రపంచ జనాభా దినోత్సవ లక్ష్యమన్నారు. ప్రపంచ జనాభా అధికారికంగా 8 బిలియన్లు దాటేసిందని, ఇది ఇలాగే పెరుగుతూ పోతే, భవిష్యత్ తరాలకు స్థిరమైన, స్నేహపూర్వక అభివృద్ధికి అడ్డంకులను సృష్టిస్తుందనేది ప్రధాన ఆందోళనగా ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్.సల్మాన్, ఏఎస్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వాల్మీకిపురం : చిన్న కుటుంబంతో చింతలు లేని కుటుంబంగా ముందుకుపోవచ్చునని మండల వైద్యాధికారిణి శ్రీవిద్య అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీ ఆసుపత్రి ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భగా ఆమె మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో వివిధ రకాల తాత్కాలిక, శాశ్వత కుటుంబ నియంత్రణ పద్ధతులు, వాటి సేవలు ఉచితంగా లభిస్తాయని, అర్హులైన దంపతులు వారికి ఇష్టమైన సరియైన పద్ధతిని ఎంచుకొని పాటించి, జనాభా నియంత్రణకు సహకరించాలని కోరారు. అంతకు మునుపు గ్రామంలో జనాభా నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జులేఖ బేగం, సనా అయేషా, వైద్య సిబ్బంది ఇందిరారాణి, సుధాకర్, భానుబి తదితరులు పాల్గొన్నారు.



మదనపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



పీలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

గుర్రంకొండ : గుర్రంకొండలో ఆరోగ్యశాఖ సిబ్బంది విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. స్థానిక తెలుగు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని, విద్యార్థులు ర్యాలీగా బయలుదేరి బస్టాండుకు చేరుకున్నారు. తల్లీబిడ్డ సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమంటూ వారు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి రవీంద్రనాయక్, పీడీ రమేష్, సీహెచ్‌వో సీతారామయ్య, హెల్త్ సూపర్‌వైజర్ నాగరాజు, ఆరోగ్యసిబ్బంది రెడ్డివాణి, జయలక్ష్మి, చందనసాయి, కవిత పాల్గొన్నారు.

కేవీపల్లె : అధిక జనాభా అనర్థాలకు మూలమని గర్నిమిట్ట, జిల్లేళ్లమంద వైద్యాధికారులు డాక్టర్ రేష్మ, డాక్టర్ సాయిశిరీష అన్నారు. గర్నిమిట్టలో, నూతనకాల్వలో ఆరోగ్య సిబ్బందిచే వికసిత్ భారత్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబ సంతోషం, శ్రేయస్సు కోసం కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అర్చన, సీహెచ్‌వో భాగ్యలక్ష్మి, పీహెచ్ఎన్ రమాదేవి, ఆరోగ్య పర్యవేక్షకులు పురుషోత్తం, రుక్మిణి, ఆరోగ్య సిబ్బంది, 104 వాహన సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరు రూరల్ : పీలేరు పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రేగళ్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కార్తీక్‌కుమార్ మాట్లాడుతూ అధిక జనాభా వల్ల పేదరికం, నిరక్షరాస్యత, అనారోగ్యం, నిరుద్యోగ సమస్య, తల్లీబిడ్డల అనారోగ్యం, రక్తహీనత, మాతృ మరణానికి, శిశుమరణానికి కూడా దారి తీయవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో జయలక్ష్మి, సూపర్‌వైజర్ రమాదేవి, చిన్నప్ప, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

కలకడ : ప్రతి ఇంటికి ఒక్కరు ముద్దు–ఇద్దరు హద్దు ఉంటేనే కుటుంబ, ఆర్థిక, విద్యాభివృద్ధి, కుటుంబ పురోగతి సాధ్యమని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలోని పాపిరెడ్డిగారిపల్లెలో ఉన్నత పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జవహర్‌బాబు, హెంపీహెచ్ ఈఓ జయరామయ్య, పీహెచ్ఎన్ సుబ్బరత్నమ్మ, సూపర్‌వైజర్లు వెంకటేశ్వరరావు, సిబ్బంది లావణ్య, జమీల్‌అహమ్మద్, వాణి, అలివేలు, మంగభాయ్, సునీత, శాంత, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె : సీహెచ్‌సీ, పీహెచ్‌సీ కోసువారిపల్లె ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. వైద్య సిబ్బందితో కలిసి అవగహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో ఇద్దరు పిల్లలకే కుటుంబ నియంత్రణ పాటిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా ముందడుగు వేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, డాక్టర్లు అనుపమ, మునికుమార్, రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ గైనకాలజిస్ట్ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ శ్రీలత

పీలేరు : పీలేరుకు చెందిన డాక్టర్ శ్రీలతకు ఉత్తమ గైనకాలజిస్ట్ అవార్డు లభించింది. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చేతుల మీదుగా ఉత్తమ గైనకాలజిస్ట్ అవార్డు డాక్టర్ శ్రీలత అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో కొండయ్య పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ



విద్యాసామగ్రి అందజేస్తున్న దాతలు

పీలేరు : మండలంలోని దేవలవారిపల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.10 వేల విలువైన విద్యాసామగ్రిని దాతలు వితరణ చేశారు. గురువారం పులిచెర్ల మండలం అరవాండ్లపల్లెకు చెందిన సుధాకర్‌నాయుడు తన తల్లి పద్మావతమ్మ జ్ఞాపకార్థం ప్లేట్లు, నోట్‌బుక్స్, పలకలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ దాతల సాయం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం విశ్వనాథరెడ్డి, ఉపాధ్యాయుడు సురేష్‌బాబు, సుధాకర్‌నాయుడు, సాంబశివనాయుడు, సుబ్రమణ్యంనాయుడు, పరంధామనాయుడు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా చట్టాలపై అవగాహన అవసరం



పీలేరు రూరల్ : వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ మోహన్‌రెడ్డి



మదనపల్లె : సదస్సులో మాట్లాడుతున్న ఎంవీఐ శివలింగయ్య

మదనపల్లె : రోడ్డు భద్రతా చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎంవీఐ శివలింగయ్య అన్నారు. గురువారం పట్టణంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో రోడ్డు భద్రతా చట్టాలపై విద్యార్థులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాద బాధితులను సకాలంలో ఆస్పత్రికి తరలిస్తే అలాంటి వారి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. రోడ్డు ప్రమాద బాధితులను ఆస్పత్రికి చేర్చిన వారిపై ఏ విధమైన పోలీస్ కేసులు ఉండవన్నారు. అంతేకాకుండా వారికి ప్రోత్సాహక బహుమతి, ప్రశంసాపత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు మైనర్‌లకు వాహనాలు ఇవ్వరాదని, నూతన రహదారి భద్రతా చట్టాల ప్రకారం ప్రమాదం జరిగితే తల్లిదండ్రులకు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రామమూర్తి, చైతన్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రోడ్డు నియమాలు పాటించాలి

పీలేరు రూరల్ : ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన చట్టాలకు లోబడి రోడ్డు నియమాలు విధిగా పాటించాలని సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక కడప రోడ్డులో ద్విచక్రవాహన దారులకు, డ్రైవర్లకు రోడ్డు నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనందారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్‌తో మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. వాహన చోదకులు రికార్డులు, లైసెన్సులు కలిగి ఉండాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులకు 30 శాతం ఐఆర్ ప్రకటించాలి

రామసముద్రం : ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే 30 శాతం ఐఆర్ ప్రకటించాలని జిల్లా ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి పోకల మధుసూదన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడియాల మురళి డిమాండ్ చేశారు. గురువారం ఎస్టీయూ సభ్యత్వం నమోదు కార్యక్రమంలో భాగంగా చెంబకూరు, మట్లవారిపల్లి, రామసముద్రం ఉన్నత పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు చెందిన పీఆర్సీ, డీఏ పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థకు నష్టం కలిగించే 117 జీవోను రద్దు చేయాలని, అమ్మకు వందనం పథకాన్ని కేవలం ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే వర్తింపజేయాలన్నారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, ఆర్థిక కార్యదర్శి అయూబ్‌ఖాన్, రమాదేవి, సురేష్, చెంబకూరు, మట్లవారిపల్లి, రామసముద్రం హెచ్ఎంలు విష్ణుప్రియ, బాలసుబ్రమణ్యం, గాయత్రి, నాయకులు శంకర, మనోహర్, నరసింహులు, మహిధర్, అనిల్‌కుమార్, జగన్నాథరెడ్డి, కేశవ, కుసుమ కుమారి, లక్ష్మి, శాంతి, ఆశాజ్యోతి, శివశంకర, శ్రీరాములురెడ్డి, బాలాజి, సుబ్బారెడ్డి, కృష్ణమూర్తి, కృష్ణయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మదనపల్లె సిటీ : ఆర్టీసీలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, ఉద్యోగులపై పనిభారం తగ్గించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. యూనియన్ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈయూ జిల్లా అధ్యక్షులు సి.ఎ.బాబు మాట్లాడుతూ సంస్థలో పని చేస్తున్న సిబ్బంది రకరకాల ఒత్తిళ్లకు గురవుతూ అనారోగ్యం పాలవుతున్నారన్నారు. మహిళా కండక్టర్లు రాత్రి సమయాల్లో డ్యూటీలు చేస్తూ అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి డిపోలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించడంలో ఆర్టీసీ ముందంజలో ఉందని, దీనికి తగ్గట్లు ఏర్పాట్లు కూడా చేయాలన్నారు. ఇతర ఉద్యోగస్తుల కంటే ఆర్టీసీలో పని చేస్తున్న కార్మికుల పని పరిస్థితులు, పనివేళలు వేరుగా ఉంటాయన్న విషయాన్ని యాజమాన్యం గుర్తు పెట్టుకోవాలన్నారు. అనారోగ్య సమస్యలతోపాటు రోడ్డు ప్రమాదాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఆర్టీసీ సిబ్బందిని ఈహెచ్ఎస్ నుంచి మినహాయించి పూర్వంలాగేనే అన్‌లిమిటెడ్ రెఫరల్ వైద్యాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కృష్ణప్ప, నాయకులు ముబారక్, తిరుమల, పూల శ్రీనివాసులు, హుస్సేన్, అంజాద్ హుస్సేన్, చంద్రకళ, సుగుణ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న నాయకులు

తపాలా శాఖ బీమాపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోస్టల్ అధికారులు

పెద్దతిప్పసముద్రం : తపాలా శాఖ ద్వారా అమలవుతున్న బీమా, వాటి ప్రయోజనాలపై మండలంలోని కందుకూరులో గురువారం చిత్తూరుకు చెందిన ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్ మేనేజర్ (ఐపీబీఎం) నాగార్జున ప్రజలకు అవగాహన కల్పించారు. అసంఘటిత కార్మికుల కుటుంబాలకు లబ్ధి చేకూరే విధానాన్ని ఆయన క్షుణంగా వివరించారు. అంత్యోదయ శ్రామిక్ సురక్ష యోజనా పథకం అమలు, రెన్యువల్ చేసే విధానం సదరు కుటుంబానికి భవిష్యత్తులో కలిగే ప్రయోజనాలను వివరించారు. ఆయన వెంట బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ శివప్రసాద్ ఉన్నారు.

రాష్ట్ర కాపునాడు కార్యదర్శిగా కటికం

రైల్వేకోడూరు అర్బన్ : ఏపీ, తెలంగాణ రాష్ట్రాల కాపునాడు రాష్ట్ర కార్యదర్శిగా కటికం సుబ్రమణ్యం నియమితులయ్యారు. తన నియామకం పట్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారాయణస్వామికి గురువారం ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపుల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. నూతన కమిటీలను నియామకం చేసి కాపునాడు అభివృద్ధికి సహకారం అందిస్తానని చెప్పారు.

క్లబ్ సేవలను విస్తృతం చేయాలి

రాజంపేట రూరల్ : నూతన ఎన్నికైన క్లబ్ కార్యవర్గం సేవలు విస్తృతం చేయాలని క్లబ్ జిల్లా గవర్నర్‌లు భయ్యా రవికుమార్, కె.చిన్నపరెడ్డి, చంద్రప్రకాష్‌లు సూచించారు. మండల పరిధిలోని పోలి సమీపంలో ఉన్న ఎస్ఎస్ కల్యాణ మండపంలో బుధవారం రాత్రి లయన్స్ క్లబ్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అనంతరం రాజంపేట లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుని వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కాగా క్లబ్ నూతన కమిటీ అధ్యక్షుడిగా రంగరాజు నరసింహరాజు, కార్యదర్శిగా పిడికిటి నాగేశ్వరరావు, కోశాధికారిగా నరసింహరావు, సభ్యులను ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు, ప్రతినిధులు పిడికిటి నాగేశ్వరరావు, షేక్ అబ్దుల్లా, డాక్టర్ సుధాకర్, డాక్టర్ సంగరాజు బాలరాజు, డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ విజయకుమార్, వై.నరసింహరాజు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక

కేవీపల్లె : మండలంలోని గ్యారంపల్లె ఎ.పి. గురుకుల పాఠశాలలో చదివిన నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బ్రహ్మాజి తెలిపారు. పదో తరగతి చదివి అత్యధిక మార్కులు సాధించిన శ్రీరాములు రూపేష్, సంకు వేణు, చైతన్య బాబు నూజివీడు ట్రిపుల్ ఐటీకి, బి.వరుణ్ కుమార్ ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పేర్కొన్నారు.

నిమ్మనపల్లె : పదవ తరగతి పరీక్షలలో ప్రతిభ చూపి నిమ్మనపల్లె జెడ్పీ హైస్కూల్ నుంచి ఇద్దరు విద్యార్థులు ఇడుపులపాయ(ఆర్కే వ్యాలీ)ఐఐఐటీకి ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం అంజాద్ అలీఖాన్ తెలిపారు. నిమ్మనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు) నుంచి ఇటీవల పదో తరగతి పరీక్షల్లో గంగాపురం పల్లెకు చెందిన శివకుమార్, పర్వీన్ దంపతుల కుమార్తె ఎస్.శ్రావ్య 568 మార్కులతో పాఠశాలలో మొదటి స్థానం పొందగా, పెద్ద రాజులపల్లెకు చెందిన తిమ్మయ్య గంగులమ్మ దంపతుల కుమార్తె కె.శ్రావణి 566 మార్కులతో ద్వితీయ స్థానం పొందిందని తెలిపారు. చక్కని ప్రతిభ చూపిన విద్యార్థులు గురువారం విడుదల చేసిన ట్రిపుల్ ఐటీ ఎంపిక జాబితాలో ఐఐఐటీ (ఆర్కే వ్యాలీ)లో సీట్లను సాధించినట్లు తెలిపారు.

పెద్దతిప్పసముద్రం : 2023–2024 విద్యా సంవత్సరంలో స్థానిక మోడల్ స్కూల్‌లో పదో తరగతి పూర్తి చేసిన భవ్యశ్రీ అనే విద్యార్థిని ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈఓ నారాయణ, ఎంఈఓ–టూ గౌస్‌పీర్, ప్రిన్సిపాల్ శివకుమారి తెలిపారు. మండలంలోని గొల్లపల్లికి చెందిన సదరు విద్యార్థిని పదవ తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో 567 మార్కులు సాధించింది. ట్రిపుల్ ఐటీకి ఎంపికైన ఆ విద్యార్థినిని పాఠశాల సిబ్బంది అభినందించారు.

ఏకగ్రీవంగా కలికిరి ఇన్‌చార్జి సర్పంచ్ ఎన్నిక

కలికిరి : మండలంలోని కలికిరి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆర్.ప్రతాప్ కుమార్ రెడ్డి మే నెల 17న అకాల మరణం చెందిన విషయం తెలిసిందే. ఇటీవల ఉప సర్పంచ్ నూరిన్నిషా తన పదవికి రాజీనామా చేశారు. ఈ క్రమంలో గురువారం డీపీఓ ఆదేశాల మేరకు ఈవోపీఆర్డీ పరుశురాం అధ్యక్షతన కలికిరి గ్రామ పంచాయతీ వార్డు సభ్యులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి సర్పంచ్‌గా 14వ వార్డు సభ్యుడు ఎల్లయ్యను ప్రతిపాదిస్తూ 2వ వార్డు సభ్యుడు అజయ్ కుమార్ తీర్మానం ప్రవేశ పెట్టారు. మొత్తం 18 మంది వార్డు సభ్యులకు గాను 13 మంది హాజరై మద్దతు తెలిపారు. దీంతో తాత్కాలిక సర్పంచ్‌గా ఎల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు ఈఓ గురుమోహన్ తెలిపారు.



ఇన్‌చార్జి సర్పంచ్‌గా ఎల్లయ్యను ఎన్నుకుంటున్న వార్డు సభ్యులు

క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్తు



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

వాల్మీకిపురం : ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలిగితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎన్‌సీసీ కేర్‌టేక్ ఆఫీసర్ రవీంద్రారెడ్డి అన్నారు. 35వ ఆంధ్రా బెటాలియన్, ఎన్‌సీసీ చిత్తూరు వారి ఆధ్వర్యంలో మే నెల 17 నుంచి 26వ తేదీ వరకు అన్యూవల్ శిక్షణా క్యాంపు జరిగింది. ఇందులో పాల్గొని విశేష ప్రతిభ చూపిన 25 మంది ఎన్‌సీసీ క్యాడెట్స్‌కి స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం హెచ్ఎం సావిత్రి చేతులమీదుగా సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను కేర్‌టేక్ ఆఫీసర్ రవీంద్రారెడ్డి అభినందించారు. భవిష్యత్తులో మరింత బాధ్యతగా పని చేయాలని విద్యార్థులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే చర్యలు

రామాపురం : ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తూ చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని 13 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న వాగులు, వంకలు, గుట్టలు, చెరువులు, కుంటలను ఎవరైనా ఆక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అన్నారు. గ్రామాలలో భూ ఆక్రమణ జరగకుండా చర్యలు తీసుకోవాలని వీఆర్‌ఓలకు ఆదేశించారు. గ్రామాలలో నుండి గ్రామ సచివాలయాలకు వచ్చే రైతులు, ప్రజలు వారు తెచ్చిన సమస్యలను పరిష్కరించాలని ఆయన అన్నారు. ఇప్పటికే పలు గ్రామాల నుండి భూ ఆక్రమణ చేస్తున్నట్లు ప్రజల నుండి ఫిర్యాదులు తమ దృష్టికి వచ్చాయని వెంటనే ఆయా గ్రామాల వీఆర్‌ఓలు అక్రమాలు జరగకుండా చూడాలని వారి సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ సిద్దేశ్వరరావు పాల్గొన్నారు.

కొమ్మల కత్తిరింపులు చేపట్టాలి

మామిడి రైతులకు ఉద్యానశాఖ అధికారిణి సూచన

లక్కిరెడ్డిపల్లె : కాయలు కోసిన 15 రోజులు తరువాత మామిడి కొమ్మల కత్తిరింపు ప్రక్రియ చేపడితే మంచి దిగుబడులు వస్తాయని ఉద్యానశాఖ అధికారిణి నాగమణి పేర్కొన్నారు. గురువారం ఉద్యానశాఖ అధికారి నాగమణి ఆధ్వర్యంలో కోనంపేట బి.ఎర్రగుడి గ్రామాల రైతులకు మామిడి పంటలో కాయలకోత తరువాత ఆచరించాల్సిన సస్యరక్షణ, సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మామిడి కాయలు కోసినప్పటి నుంచి తగు జాగ్రత్తలను పాటించినట్లైతే నాణ్యతతో కూడిన మంచి దిగుబడులు పొందవచ్చన్నారు. కాయలు కోసిన తరువాత 15 నుండి 20 రోజుల వరకు చెట్లకు విశ్రాంతి ఇచ్చిన తరువాత కొమ్మ కత్తిరింపులు చేపట్టాలన్నారు. గుబురుగా పెరిగిన చెట్లలో సూర్యరశ్మి, గాలి లోపలకు ప్రసరించేలా తలపైన కొమ్మలను, తూర్పు, పడమర దిక్కులలో ఉన్న కొమ్మలను, ఎండుపుల్ల, చీడపీడలు ఆశించిన కొమ్మలు, తొడిమ కొమ్మలను, ఎండిపోయిన పూత కాడలను కత్తిరించి తొలగించాలని సూచించారు. కత్తిరింపులు చేసిన వెంటనే కోసిన కొమ్మ భాగానికి, చెట్టు పూర్తిగా తడిచేలా 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. తొలకరి వర్షాలు పడగానే వాలుకు అడ్డంగా దున్నాలి. దున్నకాలు చేపట్టడం ద్వారా వర్షపు నీరు భూమిలో ఇంకి తేమ శాతం పెరుగుతుందని దీంతో కలుపును నివారించుకోవచ్చన్నారు. 10 సంవత్సరాలు పైబడిన చెట్లకు వర్షాధారం తోటల్లో ప్రతి చెట్టుకు 2 కిలోల యూరియా, 5 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 1.5 కిలోల మ్యూరెట్ ఆఫ్ పొటాష్ వేయాలన్నారు. నీటి వసతి కల్గిన తోటల్లో 1 కిలో యూరియా, 5 కిలోల సూపర్ ఫాస్ఫేట్ 750 గ్రాముల మ్యూరెట్ ఆఫ్ పొటాష్ చొప్పున వేయాలని సూచించారు. పిందెలు గోలి సైజులో ఉన్నప్పుడు మిగతా 1 కిలో యూరియా 750 గ్రాముల మ్యూరెట్ ఆఫ్ పొటాష్ వేయాలన్నారు. ఎరువులను చెట్లకు 4 నుంచి 5 అడుగులు దూరంలో చేసిన గాడిలో వేసి మట్టిలో కలిపి నీరు పారించాలి. జూలైలో పచ్చిరొట్ట పైరులైన జనుము, జీలుగ, పెసర, అలసంద, ఉలవలు, పిల్లిపెసర లాంటి పంటలు వేసి పూతదశలో కలియదున్నాలని సూచించారు. జింక్, బోరాన్ ధాతువుల లోపాలను నివారించడానికి 5 గ్రాములు జింక్ సల్ఫేట్, 2 గ్రాముల బోరాన్ లీటర్ నీటికి లేదా ఫార్ములా–4 పొడిని లీటరు నీటికి 5 గ్రాములు చొప్పున కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడు సార్లు పిచికారీ చేయాలని వివరించారు. ప్రతి మామిడి రైతు డ్రిప్ పద్ధతిని పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్ర సిబ్బంది ఎం.హరిత. ఒ.సుధ, రైతులు పాల్గొన్నారు.



మామిడి రైతులకు సూచనలు చేస్తున్న ఉద్యానశాఖ అధికారిణి నాగమణి